క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆలయ ప్రాంగణంలో త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం సందర్భంగా దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీశైలంకు చెందిన ఎస్. కుమార్, బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. మహాగణపతిం, శివపాదమంజీరనాదం, శివశివ శంకర, శివస్తుతి, దేవీస్తుతి, తదితర గీతాలకు శరణ్య, కవిత, రజిత, శ్రావణి తదితరులు నృత్యప్రదర్శనతో అలరించారు.

రైతులు సలహాలు పాటించాలి



రైతులకు శాస్త్రీయ సలహాలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

నందికొట్కూరు: రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు తప్పని సరిగా పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సూగన్న, రవిగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొణిదేల, నాగటూరు గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుల సలహాలు పాటించి రసాయన ఎరువులపై పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలన్నారు. భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్తుత పంటల్లో వేయాల్సిన ఎరువుల మోతాదును రైతులు తెలుసుకోవాలని సూచించారు.

మోతుకూరులో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వెలుగోడు: మండల పరిధిలోని మోతుకూరు గ్రామంలో ఆత్మకూరు డీఎస్పీ ఆదేశాల మేరకు వెలుగోడు పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది ఇంటింటికి వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. పత్రాలు లేని వారిని విచారించారు. షేక్ మహమ్మద్ రఫీ ఎలాంటి అనుమతి లేకుండా మద్యం బాటిల్స్ కలిగి ఉండగా 18 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

వెలుగోడు పట్టణంలో ఎస్ఐ సురేష్ కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా సూత్రాలు పాటించాలని సూచించారు.

కార్మికుల వేతనాలు పెంచాలని వినతి

ఆత్మకూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్దకు ర్యాలీగా వెళ్లారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్, మున్సిపల్ కార్యాలయ మేనేజర్, ఏఈలకు వినతి పత్రం అందించారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, టీఏ, డీఏ, రిస్క్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు తిమ్మయ్య, ప్రసాద్, జోసఫ్, గొడుగు రాజు, జయన్న, నాగన్న, సురేష్, హోసన్న తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- 15 మందికి గాయాలు

ఆత్మకూరు: పట్టణంలోని థెరిస్సా కాలేజీ సమీపంలో గురువారం రాత్రి పిచ్చికుక్క స్వైర విహారం చేసి 15 మందిని గాయపరిచింది. బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తోటగిరి కాలనీ, పాత బస్టాండ్ తిక్కయ్యస్వామి దర్గా సమీపంలో మరికొంత మందిని పిచ్చికుక్క కరిచింది. గమనించిన స్థానికులు వెంటనే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది పిచ్చికుక్కను వెంటాడి చంపేశారు.



జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలల్లో చిధ్రమైన తాగునీటి కుళాయిలు.



పాములపాడులో అధ్వానంగా ఉన్న మూత్రశాలలు



సంకిరేణిపల్లెలో నిలిచిపోయిన నిర్మాణాలు



నందికొట్కూరు గవర్నమెంటు హైస్కూల్‌లో తిరగని ఫ్యాన్లు



జూపాడుబంగ్లా ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా మారిన నాడు-నేడు మినరల్‌వాటర్ ప్లాంటు

మోగిన సమస్యల గంట

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- విద్యార్థులకు అందని పుస్తకాలు, దుస్తుల, విద్యా సామగ్రి
- కొన్ని పాఠశాలలకు అందని సన్నబియ్యం, గుడ్లు, చిక్కీలు
- మొదటిరోజు అమలుకాని మెనూ



సంకిరేణిపల్లెలో ఒకే గదిలో కూర్చున్న ఐదు తరగతుల విద్యార్థులు

జూపాడుబంగ్లా: 2025–26 విద్యాసంవత్సరానికి గాను గురువారం బడిగంట మోగడంతో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. మండలం వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలు 8, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ప్రాథమిక పాఠశాలలు 28 కలిపి మొత్తం 39 పాఠశాలలుండగా 4,562 మంది విద్యార్థులున్నారు. మండలంలోని తంగంచ ఉర్దూ, పోతులపాడు, చాబోలు ప్రాథమిక పాఠశాలలకు సన్నబియ్యం అందకపోవడంతో నిర్వాహకులు ఇంట్లోంచి బియ్యం తెచ్చి విద్యార్థులకు వండిపెట్టారు. తంగడంచలో లావుబియ్యంతో అన్నం వండిపెట్టారు. పాఠశాలలకు గుడ్లు, చిక్కీలు సరఫరా కాలేదు. గురువారం గుడ్డుకర్రి, వెజిటేబుల్‌రైస్, రాగిజావ వండిపెట్టాల్సి ఉండగా మెనూ ఏ ఒక్క పాఠశాలలో అమలుకాలేదు. కొన్ని పాఠశాలలకు రాగిపిండి, బెల్లం సరఫరా చేయకపోవడంతో రాగిజావ పెట్టలేదు. పాఠశాలలు ప్రారంభమైన మొదటిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగు, దుస్తులు, బూట్లు, బెల్టు లతో కలిపి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొన్నా ఎక్కడా విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసినదాఖలాల్లేవు. ఉపాధ్యాయులు, హెచ్ఎం బదిలీలు, పదోన్నతులున్నందున పాఠశాలలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అరకొరగా హాజరయ్యారు. మొదటి రోజు ఏ ఒక్క పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన ప్రారంభించినట్లు కనిపించలేదు. కొన్ని పాఠశాలల్లో సరైన కిచెన్‌షెడ్లు, తాగునీటి కుళాయిలు లేవు. నాడు–నేడు కింద సరఫరా చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఇలా అనేక సమస్యలు పాఠశాలల్లో తాండవిస్తూ మొదటి రోజు కనిపించాయి.

హాజరు అంతంత మాత్రమే

పాములపాడు: మండలంలోని 41 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తొలిరోజు విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో గైర్హాజరు ఎక్కువగానే ఉంది. స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తరగతి గదులు ఇంకా శుభ్రం చేయలేదు. ఫ్యాను విరిగి పోయి ఉంది. ఆర్వోప్లాంటు నిరుపయోగంగా ఉంది. మండలంలోని అన్ని పాఠశాలలో ఆర్వో ప్లాంట్ల పరిస్థితి ఇలాగే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సర కాలం అయ్యింది. అప్పటి నుంచి ఇవి నిరుపయోగంగా మారాయి. ఏజెన్సీ వారికి పలు మార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ఎస్‌లో స్వీపర్ 2, అటెండర్1, స్కావెంజర్ 1 పోస్టులు ఖాళీలున్నాయి. ఉన్న ఒకే ఒక స్కావెంజర్ చేతనే అన్ని చేయించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు 350 మంది విద్యార్థులకు గాను 20 మంది మాత్రమే హాజరయ్యారు.

తిరగని ఫ్యాన్లు

నందికొట్కూరు: బడి గంట గురువారం మోగింది. వేసవి సెలవుల అనంతరం గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మరి కొన్ని పాఠశాలలో ఫ్యాన్లు తిరగడం లేదు. లైట్లు వెలగడం లేదు.

విరిగిన తాగునీటి కుళాయిలు

పగిడ్యాల: మండలంలోని 18 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, 4 జెడ్పీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలు ఉండగా తక్కువ శాతం మంది పిల్లలు మాత్రమే హాజరయ్యారు. స్థానిక సంతమార్కెట్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కుళాయిలు విరిగిపోయాయి. బీరవోలు, సంకిరేణిపల్లె ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు డెస్కులు లేక కింద నేలపైనే కూర్చున్నారు. సంకిరేణిపల్లెలో నాడు నేడు కింద మంజూరైన పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ఒకే గదిలో ఐదు తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇంటి నుంచే బాటిళ్లలో నీళ్లు తెచ్చుకున్నారు.





ఆత్మకూరు: శిథిలమైన కప్పలకుంట్ల పాఠశాల తరగతి గది, ఏకలవ్యనగర్ పాఠశాలలో అరకొరగా హాజరైన విద్యార్థులు,



ప్రహరీ గోడ లేని సింగవరం ప్రభుత్వ పాఠశాల



ఆత్మకూరు: మంచినీటి కుళాయి వద్ద అపరిశుభ్రత

సమస్యల స్వాగతం

- పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరుకోని పాఠ్య, నోటు పుస్తకాలు
- ఒక్క విద్యార్థికి కూడా పంపిణీ కాని షూలు, బెల్టులు
- 20 శాతంలోపే హాజరైన విద్యార్థులు



సింగవరం హైస్కూల్ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ఆత్మకూరు: వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. బడిగంట మోగినప్పటికీ పలు పాఠశాలల్లో తొలి రోజు సమస్యలు కొట్టుమిట్టాడాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు అందకపోగా, షూస్, బెల్టులు ఒక్కటి కూడా పంపిణీ కాలేదు. తొలి రోజు కొన్ని పాఠశాలలకు ఎంఈఓ కార్యాలయం నుంచి నోట్, పాఠ్య పుస్తకాలు చేరినా, విద్యార్థులకు పంపిణీ జరగలేదు. విద్యార్థులు తక్కువగా వచ్చినందున సోమవారం నుంచి పుస్తకాలు, షూస్ అందిస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తొలిరోజు మధ్యాహ్న భోజన పథకానికి డీలర్లు అందించిన సన్నబియ్యంలో చెక్క పురుగులు కనిపించాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకులు కూడా చాలా ఆలస్యంగా పాఠశాలలకు చేరుకుని వంట ప్రారంభించారు. మండలంలో తొలిరోజు 20 శాతం కూడా విద్యార్థులు పాఠశాలలకు హాజరుకాలేదు.

విద్యార్థులకు అందని పుస్తకాలు

ఆత్మకూరు మండలంలో 11 హైస్కూళ్లు ఉండగా, 46 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 57 పాఠశాలల్లో 5,451 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి మొత్తం 36 వేలకు పైగా పాఠ్య పుస్తకాలు అన్ని పాఠశాలలకు పంపిణీ జరగాల్సి ఉండగా స్పెల్–1లో 15,676, రెండో స్పెల్‌లో 8,491 పుస్తకాలు మాత్రమే ఎంఈఓ కార్యాలయానికి అందినట్లు ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు. స్పెల్–3 కింద 6 వేలకుపైగా పాఠ్య పుస్తకాలు ఎంఈఓ కార్యాలయానికి చేరాల్సి ఉంది. ఇలాగే నోటు పుస్తకాలు పరిశీలిస్తే 6, 7వ తరగతులకు 8 నోటు పుస్తకాలు, 8వ తరగతికి 10, 9వ తరగతికి 12, 10 తరగతికి 14 చొప్పున నోటు పుస్తకాలను అందించాల్సి ఉంది. మండలంలోని 5,451 మంది విద్యార్థులకు మొత్తం 31,500కు పైగా నోటు పుస్తకాలు అందాల్సి ఉండగా, 30 వేల లోపే పాఠశాలలకు చేరుకున్నాయి. షూస్, బెల్టులు ఒక్క విద్యార్థికి కూడా అందలేదు.

అరకొరగా హాజరైన విద్యార్థులు

ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్, గరీబ్‌నగర్, ఏకలవ్యనగర్, కప్పలకుంట్ల ప్రాథమిక పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను తొలిరోజు సాక్షి విజిట్ చేసింది. ఇందులో ఏ పాఠశాలలో కూడా 20 శాతానికి మించి విద్యార్థులు హాజరుకాలేదు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 802 మంది విద్యార్థులకు గాను కేవలం 110 మంది మాత్రమే హాజరయ్యారు. గరీబ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 33 మందికి గాను 8 మంది, ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో 66 మందికి గాను 14 మంది, ఏకలవ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో 32 మందికి గాను 10 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులు లేక పాఠశాలలు వెలవెలబోయాయి. పాఠశాలలో మంచినీరు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా కనిపించాయి. సోమవారం నుంచి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సమస్యల తిష్ట

బండి ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పాఠశాలల భవనాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. మండల వ్యాప్తంగా 47 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సింగవరం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు –నేడులో చేపట్టిన భవనాల నిర్మాణం ఆగిపోయింది. పిచ్చి మొక్కల నడుమ మరుగుదొడ్ల నిర్మాణం జరగడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలో మొత్తం 69 మంది విద్యార్థులకు గాను 38 హాజరయ్యారు.

సన్న బియ్యంలో చెక్క పురుగులు

ఆత్మకూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కప్పలకుంట్ల ప్రాథమిక పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకానికి వచ్చిన సన్నబియ్యంలో చెక్క పురుగులు దర్శనమిచ్చాయి. తొలిరోజు మధ్యాహ్న భోజన పథకం మెనూ పాటించకుండానే మమ అనిపించారు.



చెక్క పురుగులు ఉన్న సన్నబియ్యం

గర్భిణులకు సీమంతాలు

నందికొట్కూరు: మిడుతూరు మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు ఐసీడీఎస్ సీడీపీఓ మంగవల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ పిలుస్తోందని ర్యాలీలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

గర్భం దాల్చిన వెంటనే పేరు నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: స్త్రీలు గర్భం దాల్చిన వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తెలిపారు. గురువారం మండలంలోని మండ్లెం, జూపాడుబంగ్లా–1 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీబాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు పసుపు,కుంకుమ, గాజులు, పూలు అందజేసి సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు వెంకటరమణమ్మ, ఇందిరమ్మ, ప్రమీలమ్మ, శ్రీదేవి, శ్యామలగౌరీ పాల్గొన్నారు.



మిడుతూరులో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ మంగవల్లి, వర్కర్లు

సాముహిక అక్షరాభ్యాసాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎర్రమఠం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో సాముహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రమఠం వైద్యాధికారి హకీమ్ భాషా హాజరయ్యారు.

వడ్లరామాపురంలో మాజీ ఎమ్మెల్యే పర్యటన



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో గురువారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మలూరు చిన్నమూర్తుజా కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆత్మకూరులోని ఎండబ్ల్యూ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మౌలానా తమ్ముడి వివాహానికి హాజరయ్యారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పరామర్శ

వెలుగోడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుల కుటుంబాలను శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం పరామర్శించారు. బక్రీద్ పండుగ రోజు బర్త్ డే కేక్ కోసం వెలుగోడు నుంచి ఆత్మకూరుకు వెళ్తుండగా వైఎస్ఆర్ స్మృతి వనం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సమీర్, సనాఉల్లా మృతిచెందారు. మృతుల కుటుంబాలను శిల్పా పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం పార్టీ నేత అచ్చయ్య తల్లి పక్షవాతానికి గురికాగా వెళ్లి పరామర్శించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి పాతబస్టాండ్‌లోని అరుగుల సెంటర్‌లో సరదాగా టీ తాగి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్‌ఖాన్, సర్పంచ్ వేల్పుల జైపాల్, షంషీర్ అలీ, రామ్మోహన్ రెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపు తనిఖీ

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును ఎంపీడీఓ మేరి గురువారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ క్యాంపుల ద్వారా బయో అథెంటికేషన్, మొబైల్ లింక్, పేరు చేర్పు,మార్పు, అడ్రస్ మార్పులు వంటి సమస్యలు తీరుతాయన్నారు.

న్యాయం చేయాలి

నందికొట్కూరు: 340సీ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న కంపెనీలో మిక్సింగ్ లారీ కింద పడి మృతి చెందిన బోయ చిన్న పక్కీరయ్య కుటుంబానికి న్యాయం జరిగే పోరాడుతామని సీపీఐఎం ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎస్ కంపెనీలో మిక్సింగ్ మిషన్ వద్ద లేబర్‌గా పని చేస్తున్న సమయంలో టిప్పర్ ఎదురుగా వచ్చి అతనిపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వాల్మీకి బోయ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు మాట్లాడుతూ మృతుడు కుటుంబాన్ని పీఎస్ కంపెనీ ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి పీఎస్ కంపెనీ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ యార్డు వీరం ప్రసాదరెడ్డి, పార్టీ నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు లాజరస్, శ్రీను, మద్రిస్వామి, నాగేశ్వరరావు, రవి, మాజీ కౌన్సిలరు ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో వర్షం

ఆత్మకూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రుతుపవనాల ప్రభావంతో ఆత్మకూరులో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నారు. గురువారం 8.2 మి.మీ, ఈ నెల 11వ తేదీ 1.2 మి.మీ, 8వ తేదీ 3.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇటీవల రైతులు సాగుచేసిన మొక్కజొన్న, కంది, మెట్ట వరి, పత్తి పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేశారు. రథశాల నుంచి నందిమండపం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఏఈఓలు మల్లికార్జునరెడ్డి, హరిదాసు, స్వాములు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్టోత్సవం

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో శ్రీకాశీ ముక్కంటి ఈశ్వర స్వామి దేవాలయ విగ్రహ ధ్వజ స్తంభ ప్రతిష్టమహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలో 3 రోజులుగా ప్రతిష్ట కార్యక్రమానికి సంబంధించి పురోహితులు శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు నిర్వహించారు. గురువారం సుప్రభాత పూజ, ప్రతిష్టాంగ హోమాదులు, యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మూలా నక్షత్రయుక్త మిధునలగ్న వృభపుష్కరాంశము యందు ప్రతిష్ట, యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. అనంతరం అభ్యావర్తిని హోమము తదితర కార్యక్రమాలు జరిపారు. రాత్రి శివపార్వతుల కళ్యాణమహోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు.

కబడ్డీ విజేత మిట్టకందాల జట్టు

ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో మిట్టకందాల జట్టు విజేతగా నిలిచి రూ.15,000 నగదు గెలుచుకుంది. ఆ తరువాతి స్థానాల్లో వరుసగా క్రిష్టారావుపేట రూ 10,000, రుద్రవరం టెంపుల్ యూత్ రూ.5000, నెహ్రూనగర్ రూ.3000, రుద్రవరం జూనియర్ రూ.2000 నగదును గెలుచుకున్నాయి. విజేత జట్లకు ఎస్ఐ సురేష్‌బాబు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఎస్ఐని సత్కరించారు.



దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట చేస్తున్న భక్తులు

పండ్లు, పూల తోటల సాగుకు రాయితీలు

జూపాడుబంగ్లా: పండ్లు, పూలతోటలు సాగుచేసుకునే రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నట్లు నందికొట్కూరు హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని తెలిపారు. గురువారం ఆమె మండలంలోని తంగడంచ గ్రామంలో రైతులు సాగుచేసిన రైతుల పొలాలను పరిశీలించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ మామిడి, చీని, డ్రాగన్‌ఫ్రూట్స్, దానిమ్మ, సీతాఫలం, సపోట, అరటి, బొప్పాయి, జామ, తదితర పండ్ల తోటలు, మల్లె, గులాబీ తదితర పూలతోటలు సాగుచేసుకొనే రైతులకు అధికంగా రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆలయ భూములకు వేలం

బండి ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆలయ భూముల కౌలుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించామని బండిఆత్మకూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ తెలిపారు. సింగవరం వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 41 ఎకరాల భూమికి వేలంలో రూ. 13.07 లక్షలు, ఓంకార సిద్ధేశ్వరస్వామి ఆలయానికి చెందిన 7.60 ఎకరాలకు రూ. 2.45 లక్షలు, నారాయణపురం ఆంజనేయస్వామి, నారాయణస్వామి ఆలయాలకు చెందిన 18.82 ఎకరాలకు రూ.5.09 లక్షల ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

పుట్టిన ఊరికి సేవ చేయడం భాగ్యం

ఆత్మకూరురూరల్: జన్మనిచ్చిన తల్లితో పాటు పుట్టిన ఊరికి సేవ చేయడం అదృష్టమని విశ్రాంత సబ్ కలెక్టర్ రఘునాథరెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామంలోని చెన్న కేశవ, సీతారామాలయంలో జరిగిన యాగంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన్ను ఆలయ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాము పుట్టిన గ్రామమైన నల్లకాల్వకు సేవ చేసేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న తమ కుటుంబ ఆస్తిలో కొంత భాగం అంగన్‌వాడీ కేంద్రానికి, పశువుల ఆస్పత్రి కోసం ఇచ్చామని.. అయితే పశువుల ఆస్పత్రిని సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నిర్మించలేక పోయిందన్నారు. అలాగే నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి వద్ద స్వాగత తోరణం కట్టించామన్నారు. గ్రామంలో నిర్మించిన ఆలయానికి తమ కుటుంబ సభ్యులం సుమారు రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో కూడా గ్రామ అభివృద్ధి కోసం సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆయన సోదరుడు రామమోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు పిసురు మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసగౌడు, ఎల్లయ్య, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ సబ్ కలెక్టర్ రఘునాథరెడ్డి

గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వెలుగోడు: మండలంలోని గుంతకందాల గ్రామంలో గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట చేసి 16 రోజులు అయిన సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి అభిషేకాలు, యజ్ఞోపవేశం మొదలగు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయ నిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులను సన్మానించారు. గాండ్ల శివన్న, ఆకుల సాయన్న, ఎస్ రఘు రాముడు యాదవ్, వెంకటరమణ, శ్రీనివాసులు, నారాయణ యాదవ్, గురుమూర్తి యాదవ్, సుబ్బరాయుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు